# ముగిసిన పోలింగ్

- ఉదయం నుంచి మందకొడిగా.. గోల్డెన్ హవర్‌లో పోటెత్తిన ఓటర్లు
- పోలింగ్ సెంటర్ల వద్ద బారులు
- పోలీసుల భారీ బందోబస్తు
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరిపీల్చుకున్న అధికార యంత్రాంగం



వరంగల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు

ఖిలావరంగల్, నవంబర్ 30: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మందకొడిగా ప్రారంభమైంది. గోల్డెన్ హవర్‌లో ఓటర్లు పోటెత్తారు. వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు లేక వెలవెలబోయాయి. ఖాళీగా ఉన్న పోలింగ్ బూత్‌లను చూసిన ఆయా పార్టీల నాయకులు, అధికారులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. గోల్డ్ హవర్‌లో మాత్రం ఓటర్లు ఒక్కసారిగా పోలింగ్ స్టేషన్ల బాటపట్టారు. సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం ఉంటుందని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు నాలుగున్నర గంటలకు ఓటర్లు భారీగా పోలింగ్ బూత్‌లకు చేరుకొని బారులు తీరారు. ఒకానొక దశలో ఓటర్లను కంట్రోల్ చేయడం కూడా పోలీసులకు సవాల్‌గా మారింది. గ్రేటర్ వరంగల్ 34, 35, 37, 38 డివిజన్లలోని శివనగర్, తూర్పుకోట, మధ్యకోట, పడమరకోట, గిరిప్రసాద్‌నగర్, రుద్రమాంబనగర్‌లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ఈసారి ఎన్నికల సంఘం ఆటోలు ఏర్పాటు చేసింది. ఆవరణ నుంచి వృద్ధులు, దివ్యాంగులను జీడబ్ల్యూఎంసీ సిబ్బంది వీల్‌చైర్లలో ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌ల్లోకి తీసుకెళ్లారు. 70 ఏళ్లకు పైబడిన వృద్ధులు కూడా స్వచ్ఛందంగా వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే, కొత్తగా ఓటుహక్కు పొందిన యువ ఓటర్లు సద్వినియోగం చేసుకున్నారు.

## నగరంలోని పలు డివిజన్లలో..

వరంగల్‌చౌరస్తా/కరీమాబాద్/గిర్మాజీపేట: వరంగల్ 27, 36వ డివిజన్లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 27వ డివిజన్ పరిధిలోని పాత మార్కెట్ కార్యాలయంలో పూర్తిగా మహిళా అధికారులతో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో 137, 138 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసిన అధికారులు.. పూర్తిగా మహిళా సిబ్బందితో నిర్వహించారు. 36వ డివిజన్ పరిధిలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన 160వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో 45 నిమిషాలపాటు పోలింగ్ నిలిచిపోయింది. అధికారులు మరమ్మతులు చేసిన అనంతరం యథావిధిగా కొనసాగింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్.. చివరి రెండు గంటల సమయంలో వేగం పుంజుకుంది. పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. అలాగే, అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని 32, 39, 40, 41, 42 డివిజన్లలో ఓటర్లు ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. అంతేకాకుండా పెరుకవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన ఘటన మినహా 25, 26, 28, 33వ డివిజన్లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పెరుకవాడలోని ఉన్నత పాఠశాలలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య–లక్ష్మి దంపతులు మండిబజార్‌లోని సుఫా హైస్కూల్‌లో, మేయర్ గుండు సుధారాణి తన కుటుంబ సభ్యులతో కలిసి పడిశాల వీరభద్రయ్య బాలికల పాఠశాలలో ఓటు వేశారు. సాయంత్రం 5 గంటకు ఒక్కసారిగా జనం పోలింగ్ కేంద్రానికి తరలిరావడంతో పెరుకవాడ ఉన్నత పాఠశాల వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేయగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు.



సాయంత్రం నాలుగున్న గంటల తర్వాత
శివనగర్ స్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు








వరంగల్ చౌరస్తా: జూబ్లీ స్కూల్‌లో క్యూలో ఉన్న ఓటర్లు, ఓటుహక్కు వినియోగించుకున్న దోనెపూడి రమేశ్‌బాబు, ఓటు వేసిన 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన



స్టేషన్‌రోడ్‌లోని కృష్ణాకాలనీలో ఓటువేసిన ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల మార్వాడీ సభ్యులు



వృద్ధురాలిని ఎత్తుకొని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న యువకుడు



ఓటుహక్కును వినియోగించుకున్న యువ ఓటర్లు



ఓటు వేసిన తర్వాత సెల్ఫీ తీసుకుంటున్న ట్రాన్స్‌జెండర్లు




ఓటు వేసిన వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



శతాధిక వృద్ధురాలితో ఓ కుటుంబం



ఓటు వేసేందుకు క్యూలో వస్తున్న యువకులు

## ‘తూర్పు’లో ముగిసిన పోలింగ్

- నియోజకవర్గంలో 2,54,641 మంది ఓటర్లు
- 230 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- సమస్యాత్మక కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్

ఖిలావరంగల్/వరంగల్, నవంబర్ 30: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చిన్నచిన్న ఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2,54,641 మంది ఓటర్లలో పురుషులు 1,24,493 మంది, 1,29,810 మంది మహిళలు, 338 మంది థర్డ్ జండర్స్ ఉన్నారు. వరంగల్ మండలంలో 121 పోలింగ్ స్టేషన్లు, ఖిలా వరంగల్ మండలంలో 109 పోలింగ్ స్టేషన్లను అందుబాటులో ఉంచారు. 57 సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఎన్నికల పోలీసు పరిశీలకుడు రాజేశ్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి సందర్శించారు. లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తూ ప్రత్యేక దృష్టి సారించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సాయంత్రం నాలుగున్నర గంటల వరకు మందకొడిగా సాగిన ఓటింగ్ సరళి ఒక్కసారిగా ఊపందుకుంది. ఓటర్లు భారీగా ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లి బారులు తీరారు. అయితే క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతినిచ్చారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం కరీమాబాద్‌లో ప్రత్యేక పోలింగ్ కేంద్రం, కొత్తవాడలో మహిళా పోలింగ్ స్టేషన్, అబ్బనికుంటలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. చింతల్‌లోని ఓ బూత్‌లో అరగంట పాటు ఈవీఎం మొరాయించడంతో స్వల్పంగా అంతరాయం ఏర్పడింది. అలాగే, ఖిలావరంగల్ పడమరకోటలోని ఓ బూత్‌లో సాయంత్రం ఒక్కసారిగా ఓటర్లు పెరగడంతో పీవో సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో అధికారులు అప్రమత్తమై పీవోను దవాఖానకు తరలించి అప్పటికప్పుడు మరో పీవోకు బాధ్యతలు అప్పగించారు.

### పోలింగ్ వివరాలు ఇలా..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలింగ్ శాతం వివరాలిలా ఉన్నాయి. ఉదయం 9 గంటల వరకు కేవలం 5 శాతం మాత్రమే ఓటింగ్ శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, ఉదయం 11 గంటలకు 13.5 శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 27 శాతం, మూడు గంటలకు 40 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 64 శాతం కలుపుకొని మొత్తంగా 74 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అయితే, సాయంత్రం 5 గంటల తర్వాత ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. బారులు తీరిన ఓటర్లు ఓట్లు వేసిన తర్వాత ఓటింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.




లేబర్‌కాలనీలో పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

## సజావుగా పోలింగ్..

కాశీబుగ్గ, నవంబర్ 30: వరంగల్‌లోని 18, 19, 20, 21, 22, 23, 24వ డివిజన్లలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సజావుగా జరిగింది. చలికాలం కావడంతో ఉదయం పోలింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం నుంచి ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరడంతో బారులు తీరారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఉన్న వారికి అవకాశం కల్పించగా, రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కాశీబుగ్గ శాంతినగర్, 18వ డివిజన్ గిర్మాజిపేట స్కూల్, ఆయుర్వేద వైద్య కళాశాలలో ఇరు వర్గాల మధ్య గొడవలు కాగా, స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి హింసా ఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు.